క్లుప్తంగా

సర్వేరాళ్ల ప్రక్రియ పరిశీలన



మిర్తివలసలో సర్వే రాళ్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ రత్నకుమారి

బలిజిపేట: సర్వే చేసిన గ్రామాల్లోని రైతుల పొలాల్లో రాళ్లను పాతే కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ రత్నకుమారి మంగళవారం పరిశీలించారు. మిర్తివలస గ్రామంలో రాళ్లు ఏ విధంగా పాతుతున్నారో పర్యవేక్షించారు. గ్రామంలో 804.07ఎకరాల విస్తీర్ణంలో రైతులకు సంబంధించిన భూముల్లో రాళ్లు పాతే కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్వే రాళ్లు పాతే కార్యక్రమాన్ని సంపూర్ణం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీటీ రమేష్‌నాయుడు, సర్వేయర్‌ చంద్రశేఖర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తం



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న హోలీస్పిరిట్‌ సిబ్బంది

బలిజిపేట: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని బలిజిపేట హోలీస్పిరిట్‌ కేర్‌ అండ్‌ సపోర్ట్‌ సెంటర్‌ సిస్టర్‌ జీవా సూచించారు. ఈ మేరకు మండలంలోని అంపావిల్లి, భైరిపురం గ్రామాల్లో వేతనదారులకు వడదెబ్బపై మంగళవారం అవగాహన కల్పించారు. వేసవిలో పనులకు వెళ్లేవారు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తప్పనిసరిగా మంచినీరు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలను తీసుకోవాలని చెప్పారు. తలకు ఎండ తగలకుండా టోపీ పెట్టుకోవాలని సూచించారు. దీంతోపాటు మరికొన్ని దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తవిటయ్య, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్‌



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై ఉన్న సువర్ణముఖినదిపై గల వంతెన మధ్యలో భారీ వాహనం మొరాయించడంతో కిలోమీటర్ల పొడవునా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పార్వతీపురం డివిజన్‌లోని పలు గ్రామాల్లో అమ్మవారి జాతర మంగళవారం నిర్వహించడం, ట్రైన్‌లు రాకపోకలు నిలిచిపోవడం వల్ల బస్సుల్లో ప్రయాణం చేయడంతో ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడ్డారు. దీంతో పోలీసులు స్పందించి మొరాయించిన వాహనాన్ని తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

ఘనంగా దాడితల్లి అమ్మవారి మారు జాతర



అమ్మవారి ఆలయంలో పూజలు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు బొబ్బిలిలోని శ్రీగొల్లపల్లి దాడితల్లి అమ్మవారి మారు జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గొల్లపల్లి, బైపాస్‌ రహదారిలోని రెండు ఆలయాల్లోనూ వేకువజాము నుంచి నిర్వహించిన పూజలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించి తరించారు. ఉదయం నుంచి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు మణికుమార్‌ శర్మ భక్తులకు పూజలు నిర్వహించారు.

రోడ్లపై చెత్త వేస్తే ఫైన్‌

బొబ్బిలి: రోజూ వస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి కాకుండా పట్టణంలోని రోడ్లపై చెత్తను పారబోసే దుకాణాల యజమానులు, ఇండ్ల యజమానులను గుర్తించి అపరాధ రుసుం విధించాలని మున్సిపల్‌ కమిషనర్‌ ఎస్‌.శ్రీనివాసరావు సచివాలయ, మున్సిపల్‌ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని కృష్ణా థియేటర్‌ రోడ్డు, ఆంజనేయ స్వామి ఆలయం, జూబ్లీ రోడ్‌, అడ్డు అగ్రహారం వీధుల్లో మున్సిపల్‌ సిబ్బందితో కలసి ఆయన మంగళవారం పర్యటించారు. పలుచోట్ల రోడ్లపై చెత్తను గుర్తించిన కమిషనర్‌ వేసే వారిని గుర్తించాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్‌ సిబ్బంది ఉన్నారు.

ఎస్‌ఈబీ సోదాలు

బొబ్బిలి: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ తదితర ప్రాంతాల్లో ఎస్‌ఈబీ సీఐ ఆర్‌.జైభీమ్‌ ఆధ్వర్యంలోని సిబ్బంది గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులు, ఇతర అనుమానిత వ్యక్తుల లగేజీలను తనిఖీ చేశారు. గంజాయి రవాణా నిషేధమని, వ్యక్తులు జైలు పాలవుతారని హెచ్చరించారు.

ఘనంగా భోగితల్లి జాతర



సీతానగరంలో సిరిమానుపై పూజారి



సీతానగరం: అమ్మవారి సిరిమాను వెంట భక్తులు

సీతానగరం: భోగితల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకుని మంగళవారం పెదభోగిలి, సీతానగరం గ్రామాల్లో సిరిమానోత్సవం ఘనంగా జరిగింది. అప్పయ్యపేట, జోగింపేట,పెదభోగిలి, సీతానగరం , బుడ్డిపేట గ్రామాల్లో అమ్మవారి జాతరలు జరుగుతున్నాయి. ఈ మేరకు భోగితల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకుని సాయంత్రం సిరిమానోత్సవంలో భాగంగా సిరిమానుపై అధిష్టించిన పూజారి మేళతాళాలతో పురవీధుల్లో తిరువీధి చేస్తూ భక్తులను ఆశ్వీరదించారు. అలాగే జోగింపేట, అప్పయ్యపేట, బుడ్డిపేట గ్రామాల్లో జాతరను పురస్కరించుకుని వందలాది ఘటాలతో అమ్మవారిని ఊరేగించారు. వేలాది మంది భక్తులతో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం అనుపోత్సవం జరగనుంది. సిరిమాను ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు ఉన్నతాధికారుల సూచనలమేరకు ఎస్సై కె. నీలకంఠం ఆధ్వర్యంలో సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

జాతరలో ప్రత్యేక వైద్యశిబిరాలు

మండలంలోని వివిధగ్రామాల్లో జరుతుగున్న భోగితల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకుని మంగళవారం జోగింపేట, అప్పయ్యపేట,పెదభోగిలి గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌ విధానం ద్వారా స్థానిక పీహెచ్‌సీ డాక్టర్‌ ఉషారాణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని టి.జగన్మోహన్‌రావు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకుమెరుగైన వైద్యసేవలు క్షేత్ర స్థాయిలో అందించాలన్న సంకల్పంతో ఫ్యామిలీ డాక్టర్‌ విధానం అమలు చేసినట్లు చెప్పారు. అమ్మవారి జాతర సందర్భంగా పలుగ్రామాలనుంచి లక్ష మందికి పైగా భక్తులు పాల్గొంటారన్న అంచనాతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్‌ ఉషారాణి మాట్లాడుతూ



సీతానగరం: మాట్లాడుతున్న డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు

గ్రామాల్లో నిర్వహించిన వైద్యశిబిరంలో సిబ్బంది ఆశ కార్యకర్తల సహకారంతో 120 మందికి వైద్యసేవలు అందించామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు 104 సిబ్బంది దుర్గాప్రసాద్‌, ప్రసాద్‌ హెల్త్‌ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా సిరిమానోత్సవాలు

బలిజిపేట: మండలంలోని బర్లి, మిర్తివలస, తుమరాడ గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలలో భాగంగా మంగళవారం సిరిమానోత్సవాలు ఘనంగా జరిగాయి. బర్లిలో శ్రీశ్రీశ్రీ గజాలమ్మ తల్లి, బంగారమ్మ తల్లి ఉత్సవం, తుమరాడలో శ్రీశ్రీశ్రీ పాదాలమ్మ తల్లి, బురదాలమ్మ తల్లి, పురటాలమ్మ తల్లి ఉత్సవాలలో భాగంగా సిరిమానోత్సవాలు నిర్వహించారు. భక్తులు సిరిమాను, పూజారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు సిరిమానును దర్శించుకున్నారు.



బలిజిపేట: బల్లి గ్రామంలో తిరుగుతున్న సిరిమాను



బలిజిపేట: తుమరాడలో తిరుగుతున్న సిరిమాను

డోకిశీలలో ఫ్యామిలీ డాక్టర్‌ శిబిరం



డోకిశీలలో గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్‌ సాహితి

పార్వతీపురంటౌన్‌: ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్‌ విధానంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారిణి సాహితి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని డోకిశీల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్‌ విధానం ద్వారా గర్భిణులు, వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరంలో వైద్యపరీక్షలను చేస్తున్నామని, అందుబాటులో ఉన్న 62రకాల మందులను రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగులకు వారి ఇళ్లవద్దనే వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



రాజాం: కలశాలలతో పవిత్ర నదీజలాలు తీసుకువస్తున్న మహిళలు

రాజాం: పట్టణ పరిధిలోని కొండంపేట గ్రామంలో శ్రీధర్మశాస్తా హిరహరసుత అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలిరోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా విగ్రహాల గ్రామ ప్రదక్షిణ, యాగశాల హోమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముద్దాన సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో కొత్తగా నిర్మించిన గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, శ్రీసత్యనారాయణస్వామి, నవగ్రహాల, దత్తాత్రేయ, నాగబంధ, షిర్డీసాయి, సత్యసాయి ఆలయాల ప్రారంభోత్సవం మంగళవారం నిర్వహించారు. వేదపండితులు అంపోలు రుద్రకోటేశ్వరరావు శర్మ, రామప్రసాద్‌ శర్మలతో పాటు గ్రామ పురోహితులు పులఖండం శ్రీనివాసరావు శర్మల పర్యవేక్షణలో ఉదయం విగ్రహాల గ్రామ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, జలాధివాసం, యాగశాల హోమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా రాజాం బాల సంస్కార్‌ కేంద్రం చిన్నారులు, బొద్దాం గ్రామ చిన్నారులు చేసిన కోలాటం ఆకట్టుకుంది.

సెలవుల్లోగా నాడు – నేడు పనులు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం:

ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు – నేడు పథకం పనులు వేసవి సెలవులు పూర్తయ్యేలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండల పరిషత్‌ సమావేశ భవనంలో మంగళవారం నాడు – నేడు పనులపై పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు, సచివాలయ ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లు, వెలుగు అధికారుల, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రెండో విడత నాడు – నేడు పథకం కింద ఏయే పాఠశాలలకు పనులు మంజూరయ్యాయో ఆయా పాఠశాలలో పనులన్నీ వేసవి సెలవులు పూర్తయ్యేలోగా శతశాతం పూర్తి చేయాలన్నారు. అందుకు అవసరమైన చర్యలు హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్‌ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాల ప్రారంభం నాటికి ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలోను, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతిలో శతశాతం విద్యార్థులు చేరేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంఈఓ త్రినాధరావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మంజూరు చేస్తారని, దీనిపై వెలుగు వీఓఏలు, సచివాలయ వెల్ఫేర్‌ అసిస్టెంట్లు గ్రామాల్లో తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఎస్‌ఏ ఏఈ రవికుమార్‌, వెలుగు ఏపీఎం రాము, యూటీఎఫ్‌ మండల ప్రధాన కార్యదర్శి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అసిరితల్లికి ప్రత్యేక పూజలు

రాజాం సిటీ: గ్రామదేవత పండగ సందర్భంగా మండలంలోని ముద్దాడ జోగివలస గ్రామదేవత అసిరితల్లిని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ మంగళవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం మరింత బాగుపడాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బి.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి

రేగిడి: త్వరితగతిన నాడు-నేడు పనులు(ఫేజ్‌-2) పూర్తి చేయాలని ఇంజినీరింగ్‌, వెల్ఫేర్‌ అసిస్టెంట్లకు ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారితో సమావేశమైన ఆయన ప్రతిరోజూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి, పనులను పర్యవేక్షించాలని తెలిపారు. సెలవులు పూర్తయ్యే నాటికి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

విద్యార్థుల చేరికపై దృష్టిసారించాలి

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టిసారించాలని ఎంఈఓ పి.నాగయ్య సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశమైన ఆయన బడిఈడు పిల్లలంతా సెలవుల తర్వాత పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. అలాగే మనబడి నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్నవారినే పనులకు అనుమతించాలి

రేగిడి: జాబ్‌కార్డు ఉన్న వారినే ఉపాధి హామీ పనులకు అనుమతించాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు సూచించారు. మంగళవారం మండలంలోని తోకలవలస, వావిలవలస, లింగాలవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనికి వచ్చేటప్పుడు వెంట తాగునీటి బాటిల్‌ తీసుకురావాలన్నారు. వేతనదారులందరికీ వంద రోజుల పని దినాలు కల్పించి, గిట్టుబాటు అయ్యే వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గర్భిణులకు అన్నదానం

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం మండలంలోని పలు గ్రామాల నుంచి రేగిడి పీహెచ్‌సీకి మంగళవారం విచ్చేసిన గర్భిణులకు రేగిడి సత్యసాయి భజన మండలి సభ్యులు అన్నదానం చేశారు. దాదాపు 60 మందికి పౌష్టికాహారం అందజేశామని భజన మండలి కన్వీనర్‌ మామిడి శివప్రసాద్‌ తెలిపారు.

పేదల కుటుంబాల్లో నవరత్నాల వెలుగులు



లబ్ధిదారునికి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మెంటాడ: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో విడతలో భాగంగా పులిగుమ్మి, గురమ్మవలస గ్రామాల్లో ఆయన మంగళవారం పాల్గొన్నారు. జగనన్న ఎన్నికల ముందు జరిగిన సంకల్ప యాత్రలో అడుగడుగడునా పేదల కష్టాలను వింటూ చలించిపోయారని, వారి కష్టాలు తీర్చేందుకే ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు ప్రతిపక్షాలకు ఏమీలేక ప్రభుత్వ పథకాలపై విరుచుకు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి బుద్ధి చెప్పి, వైఎస్సార్‌సీపీకే మళ్లీ పట్టం కడతారన్నారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ప్రజలు జగనన్నను తమ పెద్ద కొడుకులా చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌ మణ్యపురి గీతాలత, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్‌ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, మండల పార్టీ నాయకులు లెంక రత్నాకర్‌నాయుడుతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే జగనన్న ధ్యేయం



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్‌: అన్ని వర్గాల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. పార్వతీపురం మండలంలోని బందలుప్పి గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జోగారావు గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్‌ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా? అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతోందా? తదితర విషయాలు తెలుసుకునేందుకే వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్‌ భాగ్యలక్ష్మి, వైస్‌ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్‌, స్థానిక సర్పంచ్‌ యాళ్ల ప్రమీల, ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్‌ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్‌ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్‌ కన్వీనర్‌, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం



తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొన్న గిరిజనులతో తమ్మినేని

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

మెంటాడ: భూసమస్యలు పరిష్కారమయ్యే వరకూ తమ పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. తహసీల్దార్‌ కార్యాలయంలో మంగళవారం వంటా వార్పు – నిద్ర కార్యక్రమం ద్వారా నిరసన చేపట్టారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలను మంజూరు చేయాలని ఆయన డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత ముత్తాల నుండి గిరిజనులు గిరిజనేతరుల నుండి పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని వారందరికి పాస్‌ పుస్తకాలను మంజూరు చేయాలని కోరారు. గిరిజనులకు పట్టాలు మంజూరయ్యే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గుమ్మిడి సింహాచలం, చిలక సన్యాసి, గేదెల పెదరాము, రాకోటి రాములు, సీహెచ్‌ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: గర్భిణులు వారి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా గర్భిణులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ మాట్లాడుతూ గర్భిణులు ప్రతీ రోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, వైద్యుల సూచనల మేరకు ప్రతీనెలా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దీక్షితారాణి మాట్లాడుతూ గర్భిణులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. గ్రామాల్లో జరిగే ఫ్యామిలి ఫిజిషియన్‌ కార్యక్రమంలోనైనా వైద్య సేవలు పొందాలని సూచించారు. అనంతరం గర్భిణులకు స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో పౌష్టికాహారాన్ని అందజేశారు. సీహెచ్‌ఓ భాస్కరరావు, ఫార్మసిస్ట్‌ నాగేశ్వరరావు, వైద్య అధికారులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేటి పాలిసెట్‌కు పక్కా ఏర్పాట్లు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కోఆర్డినేటర్‌, ఇతర సిబ్బంది

బొబ్బిలి: పాలిసెట్‌ ప్రవేశ పరీక్షకు బొబ్బిలిలో అన్ని ఏర్పాట్లు చేశామని పరీక్షల కో ఆర్డినేటర్‌ పి.అనూరాధ తెలిపారు. ఆమె పట్టణ, మండల ప్రాంతాల్లో ఉన్న పరీక్షల కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల సిబ్బంది, పరీక్షల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించి సూచనలు చేశారు. కోమటిపల్లిలోని భాస్కర పాలిటెక్నిక్‌ కళాశాల, కలువరాయిలోని స్వామి వివేకానంద ఇంజినీరింగ్‌ కళాశాల, పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాల, తాండ్ర పాపారాయ జూనియర్‌ కళాశాల, గాయత్రి జూనియర్‌ కళాశాల, శ్రీసాయి డిగ్రీ కళాశాల, ట్రిపుల్‌ ఎస్‌ డిగ్రీ కళాశాల, ఇందిరా గాంధీ డిగ్రీ కళాశాల, శ్రీ విద్యా జూనియర్‌ కళాశాలలో పాలిసెట్‌కు 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకూ పాలిసెట్‌ పరీక్ష నిర్వహిస్తున్నట్టు కోఆర్డినేటర్‌ తెలిపారు. అసిస్టెంట్‌ కోఆర్డినేటర్‌ ఎన్‌.సుధీర్‌బాబు, ఆయా పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.